# ప్రేమా! నీకో నమస్కారం

కాకాని కమల

ఉదయం ఆరు గంటలు కావస్తోంది.

ఈరోజు సోమవారం. మా బ్యాంకుకు హాలిడే. మాది షిఫ్టు బ్రాంచి కావడంతో ఆదివారం మాకు వర్కింగ్ డే. అయినా అలవాటు ప్రకారం నేను తెల్లవారుజామునే లేచి బ్రష్‌చేసి వేడిగా మంచి కాఫీ తాగి మళ్లీ బద్ధకంగా మంచంలో దిండుకి ఏటవాలుగా పడుకుని, రాత్రి సగం చదివి వదిలిపెట్టిన నవల 'ది తర్డ్ ఐ' చేతిలోకి తీసుకున్నాను.

నవల గొప్పగా వుంది.

అంతా పాలిటిక్స్.

కానీ నాకు కొంచెం టికమక గా వుండి సరిగ్గా అర్థం కావడంలేదు.

ఒకో లైను రెండేసిసార్లు నిదానంగా చదవాల్సి వస్తోంది.

తెలుగులో చలం పుస్తకాలు, బుచ్చిబాబు నవలలు చదివినప్పుడు కూడా నేనుఇలాగే అవస్థపడ్డాను.

కొంతమంది వర్డ్ ట్విస్టింగ్ చేస్తారు. వాక్యాలు అలంకార భూయిష్టంగా తీర్చి దిద్దుతారు.

మంచంలో పడుకుని 'ఇంత చక్కగా ఎలా రాస్తారో ఈ రచయితలు' అని ఆలోచిస్తూ తెరిచిన పుస్తకాన్ని గుండెలమీద ఆన్చి కిటికీలోంచి బయటకి చూపు సారించాను.

అప్రయత్నంగా నా దృష్టి దూరంగ కనిపిస్తున్న ఆకుపచ్చ ఇంటిమీద పడింది.

రోజులాగే ఆ ఇంటి గేట్లో ఆ యువకుడు నిల్చుని ట్యూబ్‌తో మొక్కలకి నీళ్లు పెడుతున్నాడు.

నేను రియాక్ట్ అవుతూ చప్పున తలతిప్పి ఎదురింటి డాబా మీదకి చూసాను.

నా అంచనా కరక్టే.

– పంజాబీ డ్రెస్‌లోవున్న ఆ అమ్మాయి డాబా మీద కూర్చుని కొబ్బరి ఆకుల చాటుగా నిల్చుని ఆ యువకుడికేసి చూసి నవ్వుతోంది.

మధ్య మధ్య చేతివేళ్లు కదిలిస్తూ ఏవేవో సైగలు చేస్తోంది.

రోడ్డుమీంచి ఎవరైనా వెడుతుంటే చప్పున సైగలు ఆపి ఎక్సర్‌సైజులు చేస్తున్నట్లు దీక్షగా చేతులు పైకెత్తి ముందుకి కదిలిస్తూ ఎవరికి అనుమానం రాకుండా తన పనిలో నిమగ్నం అయిపోతుంది.

మళ్లీ రోడ్డు క్లియర్ కాగానే తిరిగి పిట్టగోడ దగ్గరికి వచ్చి కొబ్బరి ఆకుల చాటుగా నిల్చుని అతనికేసి చూస్తూ నవ్వుతూ సైగలుచేస్తోంది.

ఇంకా అప్పటికి ఎండా ఆరుకాలేదు.

మరీ వేకువ జాము కావడంతో రోడ్డుమీద జనం అంతగా వుండరు.

ఆ అమ్మాయి వయస్సు ఎంత ఎక్కువ చూసినా ఇరవైకంటే ఎక్కువ వుండదు. లేత తమలపాకులా అందంగా వుంది.

ఎక్కువగా మ్యాడ్రన్ డ్రెస్సులు, అప్పుడప్పుడు చీరలు, రాత్రిళ్ల నైటీలు ధరిస్తుంది.

ఇంట్లో వుంటే పగలంతా మాక్సీలోనే వుంటుంది.

రెండు జడలు వేసుకుంటుంది. ఒక్కోసారి జుట్టంతా పైకి దువ్వి పోనీటైల్‌లా కడుతుంది. లేదా క్లిప్‌పెట్టి భుజాల మీదకి వదిలేస్తుంది.

ఫ్యాషన్‌గా, నాజూగ్గా వుంటుంది.

ఆ ఎదురింటి కుర్రాడంటే ఆ అమ్మాయికి చాలా ఇష్టం అనుకుంటాను. ఇద్దరి మధ్య లవ్ అఫైర్ ఎన్నాళ్లనుంచి నడుస్తుందోగాని గాఢ ప్రేమికుల్లాగ అనిపిస్తారు.

ఆ ఎదురింటి యువకుడికి సుమారు పాతికేళ్లు వుంటాయి.

మంచి పేరో వర్‌షిప్‌తో స్మార్ట్‌గా వుంటాడు.

ఇద్దరివీ ఎదురెదురిళ్లే.

యువ హృదయాలు.

ప్రేమ వ్యవహారం ఎలా మొదలయ్యిందోగానీ రోజూ ఠంచన్‌గా ఉదయం, సాయంత్రం అలా కల్సుకుంటారు కనుచీకట్లోలో.

ఆ అమ్మాయి డాబామీద చేరి ఎక్సర్‌సైజులు మొదలుపెడుతుంది. స్కిప్పింగ్ చేస్తుంది.

ఆ డాబామీద నాలుగు మూలల పరిగెడుతూ జాగింగ్, సైకిలింగ్ లాంటివి చేస్తుంది.

అతను అదే సమయంలో తోట పని మొదలు పెడతాడు.

బ్రష్ చేయడం గేట్లోనే. వేడి కాఫీ తాగడం గేట్లోనే. గులాబీకొమ్మల కత్తిరించడం, మొక్కలకి నీళ్లుపెట్టడం, దాదాపు గంటన్నరపైగా ఇంటిముందే గడుపుతాడు.

అందులో సగం సమయం ఆ అమ్మాయికేసి చూస్తూ, నవ్వుతూ సైగలుచేస్తూ మధ్య మధ్య పని.

రోడ్డుమీద పేపరు కుర్రాడో, పాలపాకెట్లవాడో సనిలోకి వెడుతుంటే చప్పున తలతిప్పి మొక్కల్ని ప్రాణంకంటే ఎక్కువగా సంరక్షిస్తూ వుండిపోతాడు

ఆమె అంతే... డిటో...

బయట ఎప్పుడు ఎక్కడ కల్సుకుంటారో తెలియదు.

కానీ రోజా ఇద్దరూ ఉదయం సాయంపూట ఇలా తప్పనిసరిగా మాత్రం కల్సుకుని మూగప్రేమ వ్యక్తం చేసుకుంటారు.

చేతి సైగలద్వారా, కళ్లద్వారా ఏవేవో పలకరింపులు, మూగ సంభాషణలు, ఫ్లయింగ్ కిస్‌లు.

వాళ్ల ప్రేమ వ్యవహారం బహుశా వాళ్ల పెద్దవాళ్లకి తెల్సి వుండదు. పోనీ.. ఇద్దరికీ అంత ఇష్టం వున్నప్పుడు పెళ్లి చేసుకోవచ్చుకదా?

వాళ్ల సమస్య ఏమిటో...?

ఆ రెండు కుటుంబాల ఆహార వ్యవహారాలేమిటో... నాకు తెలియదు. ఎందుకంటే నేను ఈ ఇంట్లోకి అద్దెకి వచ్చి సరిగ్గా నెలరోజులు అవుతుంది

ఈ ఇల్లు చుట్టుప్రక్కల పరిసరాలే కాదు అసలు ఈ ఊరే కొత్త నాకు. ఉద్యోగరీత్యా బదిలీ అయి ఈ ఊరికి నెలక్రితమే వచ్చాను.

నేను బ్యాంకులో పని చేస్తున్నాను. నా వయస్సు ఇరవై ఆరు నడుస్తోంది. అయినా నేను పెళ్లి చేసుకోలేదు. నేను అందంగా వుండను. నాకంటే నా ఉద్యోగం ఇంకా అందమైనది.

అందుకే నాకు ఇప్పటికీ ఏవో మ్యారేజ్ ప్రపోజల్స్ బయటనుంచి, నా కొలీగ్స్ నుంచి కూడా వస్తూనే వున్నాయి.

కానీ నాకు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంలేదని, జీవితాంతం ఒంటరిగానే వుండిపోవాలని నిర్ణయించుకున్నానని అందరికీ నిక్కచ్చిగా చెప్పేసాను.

నా నిర్ణయం తెలిసి చాలామందిలో చాలా రకాల సందేహాలు, అపోహలు చెలరేగాయి.

అయినా నేను వాటిని లక్ష్యపెట్టలేదు. నా నిర్ణయం మారలేదు.

ఉద్యోగరీత్యా ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది.


రెండుగదుల ఈ చిన్న వాటా అద్దెకి దొరికింది.

నెలక్రితం ఈ ఇంట్లో అద్దెకి దిగి బ్యాంకు డ్యూటీకి వెడుతున్నాను.

నేను పనిచేసే బ్యాంకు ఇక్కడికి దగ్గరే. పదినిముషాల నడక. అద్దె కాస్త ఎక్కువే అనిపించినా అందుకే ఈ ఇంట్లో దిగాను.

రెండే గదులైనా విశాలంగా వున్నాయి.

ఈ వీధివైపు గదిలో కిటికీ దగ్గర మంచం వాల్చుకున్నాను.



కారణం చెట్ల మీంచి గాలి వస్తుంది.

కాలక్షేపంగా రోడ్డు కనిపిస్తుంది.

ఈ ఇంట్లోకి వచ్చిన మర్నాటి నుంచి నేను రోజూ వాళ్లిద్దర్నీ చూస్తూనే వున్నాను.

ఉదయం చీకట్లు విడకముందే లేవగానే సాయంత్రం చీకట్లు ముసిరే వేళ బ్యాంకునుంచి రాగానే వేడివేడి కాఫీ తాగుతూ కిటికీ దగ్గర కూర్చుని కాలక్షేపంగా చూడడం అలవాటు.

ఆ సమయంలో రంజనుగా ఆ డాబా మీద అమ్మాయి, ఎదురింటి పూలతోటలో ఆ అబ్బాయి ఒంటరితనంతో వేగే నాకు మంచి కాలక్షేపం అయ్యారు.

వాళ్లిద్దరి ప్రేమని ఆలోచిస్తే నాకు గొప్ప ఆనందం, ఒకోసారి ఎంతో ఈర్ష్య కూడా చెలరేగుతాయి మనసులో.

ఆ కుర్రాడు ఇంజనీర్ అనుకుంటాను. పి.హెచ్.సుధాకర్, ఆటోమొబైల్ ఇంజనీర్ అన్న నేమ్‌బోర్డు ఆ ఇంటి ముందు కనిపిస్తుంది.

ఏదన్నా ప్రైవేటు ఫర్మ్ నడిపిస్తున్నాడో లేక ఒద్యోగమో నాకు తెలియదు. కానీ రోజూ ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో కారు తీసుకుని వెళ్లిపోతాడు.

ఇంటిముందు చిన్న కార్లు షెడ్డు, పూలతోట, గేటు, చిన్నదే అయినా ఇల్లు నీట్‌గా అందంగా వుంటుంది.

అతని కారు వెళ్లిన పదినిముషాలకి నేను బ్యాంకుకు వెళతాను. ఒక్కోసారి అతని కారు నాకు ఎదురుపడుతుంది కూడా.

మాది మార్నింగ్ షిఫ్టు బ్రాంచి. తొమ్మిదినుండి నాలుగున్నరదాకా.

ఆ ఇంట్లో ఆ సుధాకర్ తల్లి వుంటారనుకుంటాను.

అతను కారు తీసి ఆఫీసుకి వెళుతుంటే విధవరాలైన అతని తల్లి గేటుదాకా వచ్చి సాగనంపుతుంది. కొడుకు వెళ్లిపోయాక జాగ్రత్తగా గేటు గడియవేసి లోపలికి వెళ్లిపోతుంది. కొంచెం కలిగిన వాళ్లలాగే అనిపిస్తారు.

ఆ ఎదురింటి డాబా మీది అమ్మాయి కాలేజీకి వెళుతుందో, ఆఫీసుకి వెళుతుందో లేక ఇంట్లోనే వుంటుందో నాకు తెలియదు. ఎందుకంటే నేను తొమ్మిదింటికే బ్యాంక్‌కి వెళ్లిపోతాను.

నేను ఇలా ఆలోచిస్తూ ఎదురిల్లువైపు చూస్తూ వుండగానే ఆ అమ్మాయి డాబా దిగి వెళ్లిపోతుంది.

అతను కూడా చేతిలో ట్యూబు పక్కన పడేసి లోపలికి వెళ్లిపోతాడు. వెళ్లేముందు అరచేతి లోంచి ఒక ఫ్లయింగ్ కిస్ ఆమెకి విసిరి వెళ్లిపోతాడు.

ఆ కిస్‌కి సమాధానంగా ఆ అమ్మాయి చేతివేళ్లు గాల్లో కదిలిస్తూ ఏవో సైగలు చేసింది.

ఆ సైగల భావం ఏమిటో నాకు అర్థంకాలేదు.

ఆ ప్రేమజంట లోపలికి వెళ్లిపోయినా నేను చాలాసేపు అలాగే నిల్చుండిపోతాను.

ఆ ప్రేమ జంటని, వాళ్ల అనుబంధాన్ని చూస్తుంటే నాలో ఏదో పచ్చని మంట రగిలినట్టు అయ్యింది.

ప్రేమంటే ఏమిటో తెలియని జడ పదార్థం కాదు నా మనసు.

కోర్కె తెలియని రాతి శరీరం అసలేకాదు.

పరిపూర్ణమైన స్త్రీని నేను.

ఆ రోజుల్లో... అంటే నేను కాలేజీలో, యూనివర్శిటీలో చదివే రోజుల్లో ఎంతోమంది యువకులు నాకు ప్రేమలేఖలు వ్రాసారు. నా స్నేహం కోసం, స్పర్శ కోసం తపించారు. కొంతమంది సిన్సియర్‌గా కొంతమంది తమాషాకి. పూలతోటకి వెళ్లినప్పుడు ఎన్నో రంగురంగుల పూలు మనల్ని ఆకర్షిస్తాయి.

వాటి పరిమళాలు మనల్ని అలరిస్తాయి.

వాటిలో కొన్ని మరీ మరీ మనసుల్ని దోచుకుంటాయి.

కానీ తోట మొత్తంలో ఏదో ఒక పువ్వు మాత్రమే కోసుకోవాలని మాలి షరతు పెట్టినప్పుడు మనం ''ఏం పువ్వు ఎంచుకోవాలి?' అని కాస్త ఆలోచనలో పడతాం.

ఆ రోజుల్లో నాకు వచ్చిన ప్రేమలేఖలు అందుతున్న నేను కూడా అలాంటి ఆలోచనలోనే పడి ఏది నిర్ణయించుకోకముందే నా జీవితంలో ఒక విషాద సంఘటన జరిగిపోయింది.

నిజానికి నాకు వచ్చిన కొన్ని ఉత్తరాల్లో నందకుమార్ రాసిన ఉత్తరం నన్ను ఎక్కువగా ఆకర్షించింది.

అతను నాకు కొత్త సంవత్సరం గ్రీటింగ్స్ పంపుతూ నాకు చిన్న ఉత్తరం స్నేహభావంగా రాసాడు. అప్పుడు మాకు టర్మ్ హాలిడేస్. హాస్టల్ ఖాళీచేసి అతను వాళ్ల ఊరికి వెళ్లాడు. అందుకే నాకు ఉత్తరం ద్వారా గ్రీటింగ్స్ పంపించాడు.

తిరిగి నేను అతనికి గ్రీటింగ్స్ పంపుతూ ఉత్తరం రాద్దాం అనుకున్నాను.

కానీ అంతలోనే నా జీవితంలో విషపు చినుకు రాలింది.

నేను యూనివర్శిటీలో చేరిన కొత్తలో జగన్ అనే నా సీనియర్ స్టూడెంట్ నన్ను బాగా రేగింగ్ చేసాడు. నేను కనిపిస్తే చాలా వల్గర్‌గా కామెంట్స్ చేసేవాడు. వెంటబడి వేధించేవాడు. అటువంటి సందర్భంలోనే ఒకసారి అవమానం భరించలేక క్యాంటీన్ దగ్గర అతన్ని చెంపమీద కొట్టాను.

ఆ తరువాత అతను నా జోలికి రాలేదు.

ఒక ఆరునెలలు గడిచాయి.

వాడి గొడవ వదిలిపోయింది అనుకున్నాను. ఆడపిల్ల మెత్తగా ఒదిగి వున్నంతకాలమే నొక్కుతారు. ఎదురు తిరిగితే ఏం చేయలేరు అనుకున్నాను గర్వంగా. కానీ అసలు గొడవ అప్పుడే మొదలయిందన్న సంగతి నాకు ఆలస్యంగా తెలిసింది.

నా ఫ్రెండ్ సుజాత తల్లికి టిబి వచ్చింది.

మదనపల్లి తీసుకువెళ్లారు. రెండు నెలల తరువాత సుజాత వచ్చిందన్న సంగతి తెల్సి వాళ్లింటికి చూడడానికి వెళ్లాను. ఆ సమాచారం ఫోనులో ఎవరో ఒక అమ్మాయి నాకు చెప్పి సుజాత నన్ను వాళ్లింటికి రమ్మందని కూడా చెప్పింది. ఆ మాట పట్టుకుని నేను సుజాత వాళ్లింటికి వెళ్లేసరికి వాళ్ల అన్నయ్య డ్రాయింగ్‌రూమ్‌లో వున్నాడు. సుజాత లోపల వుంది వెళ్లమన్నాడు. నేను చొరవగా సుజాత గదివైపు వెళ్లాను.

అక్కడ జగన్ వున్నాడు.

జగన్, సుజాత అన్న శరత్ గాఢ స్నేహితులని తెలుసు. కానీ మరీ ఇంత గాఢ స్నేహితులని తెలియదు.

నేను వెనుతిరిగేసరికి తలుపులన్నీ మూసుకుపోయాయి.

రోజూ ఉదయం రెండుగంటలు, సాయంత్రం రెండుగంటలు జిమ్‌లో కసరత్తు చేస్తూ అరకిలో కోడి, నాలుగు గుడ్లు, అరలీటరు పాలు, గుత్తి అరటి పళ్లు తింటూ బాడీ బిల్డర్స్ ఛాంపియన్‌షిప్ కోసం ప్రయత్నం చేస్తున్న జగన్ బలం ముందు ఓ ముద్ద ఎక్కువ తింటే ఎక్కడ వళ్లు వస్తుందో అన్న భయంతో డైటింగ్ చేసి నాజూకుతనాన్ని పెంచుకుంటున్న నేను ఓడిపోక తప్పలేదు.


''అప్పుడు కాదు చెంపదెబ్బ కొట్టడం, ఇప్పుడు కొట్టు చూస్తాను'' అంటూ జగన్ స్వయంగా తన ముఖాన్ని నా ముఖం దగ్గర పెట్టి నా అరచేతిని పట్టుకుని తన చెంపకి నొక్కుకున్నాడు.


అయినా నేను చెంపదెబ్బ కొట్టలేదు.

నా చేతిని వెనక్కి గింజుకున్నాను.

అతను బలవంతాన నా పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు.

లవ్ అయినా, రొమాన్స్ అయినా మనకి ఇష్టం






## ఆమని కోరిక

టెలివిజన్ అందచందాల ఆమనిని కలిసినప్పుడు '1994 నాకు బాగా కలిసొచ్చింది. కలలో కూడా ఊహించని విధంగా నంది అవార్డు తీసుకున్నాను. నేను నటించిన కొత్త చిత్రాలూ హిట్ అయ్యాయి. ప్రస్తుతం దాసరి, కె.విశ్వనాథ్, కె.రాఘవేంద్రరావు లాంటి పెద్ద పెద్ద దర్శకుల దగ్గర, పెద్ద పెద్ద హీరోలతో నటిస్తున్నాను. అయితే నన్ను మంచి నటిగా ప్రేక్షకులలో స్థిరపడాలన్నదే నా కోరిక' అంది. ఆమని కోరిక సమంజసమే!

—సుబ్బారావు



ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక

కవిత్వమంటే చెవి కోసుకునే
యువతీయువకుల కోసం
ఆంధ్రభూమి కానుక

## చతురచరణాలు

మీరు రాయాల్సిందల్లా -
మినీ కవిత
నాలుగు లైన్లు
జస్ట్ ఫోర్ లైన్స్ పొయిట్రీ!
మీ మనసులో వున్న గొప్ప భావాన్ని చాతుర్యంగా చతురంగా నాలుగు చరణాల్లో ఫన్, ఫన్ మేళవించి—
కవితగా మలచి
చివరిగా అడ్రసు రాసి
కవర్‌లో మడచి
ఫోటో జతచేసి
పోస్ట్ చెయ్యండి. ఎక్కువమంది కవులకు కవయిత్రులకు అవకాశం ఇచ్చే ఈ ఫీచర్‌లో వారం వారం ఒక మంచి కవితకు బహుమతి కూడా వుంటుంది.

చతురచరణాలు ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్ - 500003 అడ్రసుకు వెంటనే పంపించండి.

◆◆◆


వున్నప్పుడు జరిగితేనే ఆనందం. అదీ మనకి ఇష్టం వున్న వాళ్లతో.

బలవంతాన జరిగితే అంతకంటే అసహ్యం వేరే ఏం వుంటుంది!

ఆ తరువాత నెలరోజులకి సుజాత వాళ్ల అమ్మావాళ్లు వచ్చారు.

సుజాత వాళ్ల అన్నయ్య శాడిజం గురించి చెప్దామనుకున్నాను.

కానీ అందువల్ల ప్రయోజనం లేదు సరికదా నా బతుకు రోడ్డుమీదకు వస్తుంది

అందుకే ఎవరికీ చెప్పలేదు

ఈరోజుదాకా ఆ బడబాగ్ని నాలోనే భరిస్తున్నాను.

పెళ్లి చేసుకోనని భీష్మించుకున్నాను.

అమ్మా, నాన్నా, అన్నయ్య కొట్టినంత పని చేసారు.

అయినాసరే నా నిర్ణయం మారలేదు.

నేను ఎవరినో ప్రేమించి మోసపోయాననీ, సంసారానికి పనికిరాననీ, నాకు పిల్లలు పుట్టరనీ, ఏదో జబ్బు అనీ ఇలా ఎన్నో పుకార్లు నా గురించి. అన్నీ మౌనంగా భరించాను.

కానీ...

ఏదన్నా ప్రేమ కథ చదివినప్పుడో, సినిమా చూసినప్పుడో నా మనసు మౌనరాగాలు ఆలపిస్తుంది.

నందకుమార్ జ్ఞాపకం వస్తాడు.

ప్రేమ రుచి తెలియకుండానే నా మనసు మోడు అయింది అనుకుంటే గుండెలో జ్వాలలు చెలరేగుతాయి.

నందూ ఇప్పుడు ఎక్కడ వున్నాడో?

పెళ్లి చేసుకున్నాడా? ఎందరు పిల్లలు? ఏం ఉద్యోగం చేస్తున్నాడు? ఉత్తరానికి జవాబు రాయలేదని, తిరిగి గ్రీటింగ్స్ పంపలేదని అతను ఏం అనుకున్నాడు?

తన మనసుని అతను కనీసం ఊహించగలడా?

"ఉఫ్..." ఆలోచనలు భరించలేనట్లు తల విదల్చుకున్నా.

నా గుండెల మీద గువ్వలా ఒదిగిన 'ద థర్డ్ ఐ' తీసాను.

పుస్తకాల్లోను, జీవితంలోనూ, ప్రేమలోనూ అంతా పాలిటిక్స్.

దలైలామా అంటే 'దేముని దయా' అని అర్థంట.

ఎంత చక్కని పదం? దలైలామా...

◆◆◆

చూస్తూ వుండగానే రెండునెలలు గడిచిపోయాయి.

ఈ ఊరు, నా బ్రాంచి అన్నీ నాకు పాతబడ్డాయి. నాకు తగిన కాలక్షేపం స్నేహితులు కూడా నాకు బాగానే అయ్యారు.

వీటన్నింటితోపాటు ఆ ఎదురింటి ఆకుపచ్చ మేడ అబ్బాయి, డాబా మీది అమ్మాయిని కూడా గమనిస్తూనే వున్నాను. వాళ్లిద్దరి ప్రేమ వ్యవహారం ఎప్పటిలాగే సజావుగా, ఆనందంగా సాగిపోతోంది. రోజురోజుకూ ఇద్దరి మధ్య రొమాంటిక్ సీన్లు ఎక్కువైపోతున్నాయి.

సాయంత్రాలు బ్యాంక్ నుంచి రావడం ఆలస్యం అయినా ఫ్రెండ్స్‌తో సినిమాకో, షాపింగ్‌కో వెళ్లినా వాళ్లిద్దర్ని సాయంత్రాలు గమనించడం కుదరడంలేదు. కానీ ఉదయం మాత్రం తప్పకుండా వాళ్ల ప్రేమ వ్యవహారం నా కళ్లని విందు చేస్తూనే వుంది.

వాళ్లని గమనిస్తుంటే నాలో ఎన్నో చిలిపి ఊహలు...

వాళ్లిద్దరూ బయట కల్సుకుంటారా?

పెద్దల కళ్లుగప్పి హోటల్స్‌కి, సినిమాలకి వెళతారా? లేక పార్కుల్లో ఏకాంతంగా కల్సుకుంటారా? అతను ఆమెని ముద్దు అడుగుతాడా?

నా పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

వాళ్లద్దరి గురించి నాకెందుకిన్ని ఊహాగానాలు?

నందకుమార్ జ్ఞాపకం వచ్చాడు.

తను అతన్ని మనసు పడింది.

కానీ తను ఇద్దరి మధ్య ఆ మధుర భావన రాకముందే జగన్ తుఫాన్‌గాలిలా తన మనసులోని చిన్న చిన్న ఆశని నేలకూల్చివేసాడు.

భగవంతుని దీపారాధన కోసం వెలిగించిన ప్రమిద ఒంటిని కాల్చినట్టు...

◆◆◆

ఏప్రిల్ నెల వచ్చింది.

మా బ్యాంకు యాన్యువల్ క్లోజింగ్స్ మొదలయ్యాయి.

బిజీ బిజీ. ఇంటికి వచ్చేసరికి బాగా రాత్రి అవుతోంది.

సాయంత్రాలు ఆ ఎదురింటి ప్రేమ జంటని గమనించలేకపోతున్నాను.

కానీ ఉదయం పూట నేను ఆ లవ్ బర్డ్స్‌ని మిస్ కావడంలేదు.

అతను కొంటె నవ్వులతో ఆ అమ్మాయికి గులాబీలు కత్తిరించి డాబీ మీదకి విసరడం. ఫ్లయింగ్ కిస్‌లు అందించడం, ఆమె తిరిగి అతనికి ఏవో సైగలు చేయడం, అరచేతిని గులాబీరేకు పెదవులకు అద్దుకుని ఊరించడం, నాలో అణగారిన ఏవో మధుర ఆలోచనలని వెలికితీసి నన్ను ఆనందప చేవి. నాలోని అసంతృప్తిని 'ఇగో'ని చల్లార్చేవి.

"ప్రేమ తెలియని మనసు శ్మశానంతో సమానం" అని బసవరాజు అప్పారావు కాగోలు అన్నాడు.

ఆ రెండూ నాకు చాతకాలేదు.

చూస్తూ వుండగానే నెల గడిచిపోయింది.

బ్యాంక్ క్లోజింగ్స్ పూర్తి అయ్యాయి. పని వత్తిడి తగ్గింది. ఏవో పండుగల సందర్భంగా రెండురోజులు సెలవులు కల్సి వచ్చాయి. రాత్రి పడుకోబోయేముందు మందారాకులు తెచ్చి తలకు పెట్టుకున్నాను. చీకటితో లేచి కుంకుడు రసంతో స్నానం చేసి పింక్ బ్లాక్ కాంబినేషన్ కాటన్ చీర కట్టుకుని జుత్తు చిక్కులు తీస్తూ కిటికీ దగ్గరకి వచ్చి నిల్చున్నా. నా దృష్టి ఎదురింటి ఆకుపచ్చ మేడ ముందు నిలిచిపోయింది.

ఆ ఆకుపచ్చ ఇంటిముందు షామియానా వేస్తున్నారు. గేటు దగ్గర ఆగిన గూడ్స్ క్యారియర్ లోంచి పెద్ద పెద్ద వంట పాత్రలు, కుర్చీలు దింపుతున్నారు అమాలీలు.

"అరె! ఆ ఇంట్లో ఏంటి ఫంక్షన్? ఆ యువకుడికి పెళ్లి కాని కుదిరిందా? ఆ ఎదురింటి డాబా మీది అమ్మాయితోనా? లేక..."

నా మనసులో ఏదో చెప్పరాని ఆరాటం బయలుదేరింది.

బాసిన్లు తోమడానికి పనిపిల్ల రాగానే కిటికీలోంచి ఆ ఆకుపచ్చ బంగ్లావైపు చూపిస్తూ "ఆ ఇంటి ముందు షామియానా వేశారేంటి? ఎవరిదన్నా పెళ్లా?" అన్నాను ఉత్సుకతగా.

"కాదమ్మగారూ! ఆ ఇంటామెకి మనవడు పుట్టాడు. చంటిపిల్లవాడ్ని తీసుకుని కోడలు నిన్ననే వచ్చింది. అందుకని ఇయ్యాల బస్తీలో అందరికీ దావతు ఇస్తున్నారు" అంది.

నా కళ్లు ముడుచుకున్నాయి.

"మనవడు పుట్టాడా? ఆ ఇంటామెకి ఎందరు పిల్లలు?"

"ఒక్కడే కొడుకు, రోజూ కార్ల నెడతాడు. పొద్దుగాల మొక్కలని గొట్టాంతో నీళ్లు పెడతాడు"

అంతలోనే ఆయువ ఇంట్లోంచి బయటకు వచ్చి కుర్చీలో దింపుతున్న అమాలీలతో ఏదో అంటున్నాడు.

నేను చప్పున అతడ్ని చూపించేంతలో పనిపిల్ల "అదిగో! ఆయనకే కొడుకు పుట్టిండు"

"అతనికి పెళ్లి అయిందా?"

పనిపిల్ల గలగలా నవ్వింది. "పెండ్లి కాకుండా కొడుకెట్ల పుడతాడు దొరసాని? నిరుడు ఏవంగిలో అక్క కూతురుతో పెండ్లి అయింది. ఏడవ నెల రాంగానే పెండ్లాం పుట్టింటికి వెళ్లింది. కొడుకు పుట్టాడు. చంటిబిడ్డకి మూడవనెల పడిందట. నిన్న వచ్చింది, అందుకని ఘనంగా అందరికీ దావతు ఇస్తున్నారు" అంది.

సరిగ్గా అదే సమయానికి ఆ ఎదురింటి డాబా మీదకి ఆ ఫ్లయింగ్‌సైగలు చేసే అమ్మాయి వచ్చి తడిబట్టలు దస్మెం మీద ఆరెయ్యడం మొదలుపెట్టింది.

"అదిగో ఆ డాబా మీదకి వచ్చింది చూడు ఆ అమ్మాయి ఎవరు?" అన్నాను ఉద్విగ్నంగా.

"ఆమెనా? ఆ ఇంటాయన కూతురు. తెల్లగా రబ్బరుబొమ్మలెక్క అందంగా వుంటుంది. పేరు ఇ(హి)మజ."

"ఏం చేస్తుంది?"

"బాగా సదివింది. కానీ ఆ సదువేంటో నాకు తెల్వదు. కానీ ఇంకో నాలుగునెలల్లో అమెరికా ఎళ్లిపోతుందంట"

"అమెరికానా? ఎందుకు?"

"ఆమెకి మొన్న శావణం (శ్రావణం)లో పెండ్లి అయింది. పెనిమిటి అమెరికాలో వుంటాడు. ఆడ ఆయనకి ఉద్యోగం అట. ఈమెకి టిక్కెట్టు దొరకలేదంట. ఏదో పైరవి చేసి టిక్కెట్టు సంపాదించినారంట. ఇంకో నాలుగు నెల్లల్లో అమెరికా వెళ్లిపోతుందంట. ఇంగ ఇప్పుడిప్పుడే రాదంట" అంటూ పనిపిల్ల ఉత్సాహంగా ఇంకా ఏదో చెప్తూనే వుంది.

కానీ నాకవేం వినిపించడంలేదు.

నా తల్లో ఏదో విస్ఫోటం.

భరించరాని అలజడి.


దేవదాసు పార్వతిల ప్రేమ విన్నాను. పార్వతి కోసం దేవదాసు పిచ్చివాడు అయ్యాడు.

లైలా కోసం మజ్నూ కొరడా దెబ్బలు తిన్నాడు. రోమియో జూలియట్ ప్రేమకి ప్రాణంపోసి చరిత్రలో మిగిలిపోయారు. షాజహాన్ ముంతాజ్ కోసం మహలు నిర్మించాడు. ఇలా ఎన్నో ప్రేమని నేర్పుతూ చరిత్రలో ఆదర్శంగా మిగిలిపోయిన ప్రేమ కథలు నాకు తెలుసు.

కానీ...

లక్షణంగా పెళ్లయి భర్త వున్న ఒక అమ్మాయి, భార్యని తొలిచూలు పురిటికి పంపిన ఎదురింటి 'అబ్బాయి'తో 'వ్యవహారం' సాగించడం కూడా ప్రేమ కథ అయితే!

"హతవిధీ! ప్రేమా! నీకో నమస్కారం!" ★



## నరేష్

కామెడీ హీరోగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో, ప్రేక్షకులలో ఓ ముద్ర వేసుకున్న నరేష్ నటించిన 'చిత్రం భళారే విచిత్రం' చిత్రం తరువాత అంతటి గొప్ప హిట్ చిత్రం రాలేదన్న బెంగ అతనికుంది.

అయితే 'ఆమె' చిత్రం అతనికి మంచి పేరు, గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "వచ్చిన ప్రతి అవకాశాన్ని ఒప్పుకోకుండా నటుడిగా గుర్తింపు వచ్చే పాత్రలు వేయాలనుకున్నాను. ప్రస్తుతం 'పోగాను మాడ ...' చిత్రం చేస్తున్నాను. ఇది వెరైటీ సబ్జెక్టు" అన్నాడు. ఆలస్యం అయినా నరేష్ మంచి నిర్ణయం తీసుకున్నాడు.

—సుబ్బారావు

